100 కోట్లతో ట్రస్టు ఏర్పాటు చేస్తా

నిరుపేదలకు ఉచిత విద్య, ఉపాధి శిక్షణ • ప్రతి నియోజకవర్గంలో ఒక ఫంక్షన్ హాల్ • ఒక్క రూపాయికే శుభకార్యానికి అవకాశం • మెదక్‌లో పారిశ్రామికాభివృద్ధికి కృషి

పేదలకు సేవ చేసేందుకే ప్రత్యక్ష రాజకీయాల్లోకి.. • ప్రజల కోసమే రిజర్వాయర్ల నిర్మాణం • కాంగ్రెస్, బీజేపీలవి అసత్య ప్రచారాలు • బీఆర్ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి పీ వెంకట్రామిరెడ్డి

సిద్దిపేట, ఏప్రిల్ 28(నమసే తెలంగాణ ప్రతినిధి) : 'పేదలకు సేవ చేయాలనే సంకల్పంతో ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చాను. కేసీఆర్ కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటాను. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ, ఒక కుటుంబ సభ్యుడిగా ఉంటాను. నిండు మనస్సుతో దీవిస్తే ప్రజల కష్టసుఖాల్లో తోడుంటాను. మన ప్రాంతంపై ఉన్న ప్రత్యేక ప్రేమతో అందరికీ విస్తృత సేవలను అందించాలనే సంకల్పంతో ఎంపీగా పోటీలో నిలిచా'..అని మెదక్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి పీ వెంకట్రామిరెడ్డి అన్నారు. గత పదేండ్ల పాలనలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మార్గదర్శకంలో, మాజీ మంత్రి హరీశ్‌రావు నాయకత్వంలో మెదక్ పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో చాలా అభివృద్ధి జరిగిందని చెప్పారు. తాను వ్యక్తిగతంగా రూ. 100 కోట్లతో ట్రస్టును ఏర్పాటు చేసి, యువతకు స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలు, ఉద్యోగ మేళాలు నిర్వహిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా 'నమస్తే తెలంగాణ' ప్రతినిధితో ఆయన ప్రత్యేక ఇంటర్వ్యూ...

ప్రజల నుంచి స్పందన ఎలా ఉన్నది..?

ప్రజల ఆదరణ ఉంది. ఉమ్మడి మెదక్ జిల్లాలో కలెక్టర్‌గా పని చేసిన అనుభవం ఉంది. ప్రతి సమస్య తెలిసిన వ్యక్తిని. ప్రతి గ్రామంలో పంద మందిని పేరు పెట్టి పిలిచేంత పరిచయాలు ఉన్నాయి. ఒక అధికారిగా నన్ను ఆదరించారు. ఇవ్వాళ ఆశీర్వదిస్తున్నారు. మెదక్ పార్లమెంట్ స్థానం బీఆర్ఎస్ పార్టీకి కంచుకోట. పార్టీ పటిష్టంగా ఉంది. క్యాడర్ సైనికుల్లా పనిచేస్తున్నారు. అందరి సహకారంతో మెదక్ ఎంపీగా భారీ మెజార్టీతో గెలుస్తాను. అన్ని మండల కేంద్రాల్లో సన్నాహక సమావేశాలతోపాటు రోడ్ షోలు నిర్వహిస్తున్నాం. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర పార్టీ ముఖ్యనేతలు, కార్యకర్తలు, అన్ని విభాగాల నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పార్టీ గెలుపు కోసం ఆహర్నిశలు కృషి చేస్తున్నారు. గ్రామాల్లో గులాబీ సైన్యం ఇంటింటా ప్రచారం ప్రారంభించింది. బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలన వ్యత్యాసాన్ని ప్రజలకు వివరిస్తున్నారు. మా వెంకట్రామన్న కలెక్టర్‌గా బాగా పని చేసిండు..ఎంపీగా అయితే మరింతగా పనిచేస్తడన్న ఉత్సాహంతో ముందుకు పోతున్నారు. క్యాడర్ రెట్టించిన ఉత్సాహంతో పనిచేస్తున్నారు. ఎప్పటికప్పుడు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మార్గదర్శనం చేస్తున్నారు. మాజీ మంత్రి హరీశ్‌రావు నాయకత్వంలో ముందుకుపోతున్నాం. టెలికాన్ఫరెన్స్ ద్వారా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సూచనలు ఇస్తున్నారు. ఖచ్చితంగా విజయం మాదే.

కాంగ్రెస్, బీజేపీలు చేస్తున్న విమర్శలపై మీ కామెంట్..?

మల్లన్నసాగర్ ముంపు గ్రామాల్లో మొన్న జరిగిన శాసనసభ ఎన్నికల్లో కేసీఆర్‌కు మంచి మెజార్టీ వచ్చింది. ఈ పార్లమెంట్ ఎన్నికల్లోనూ అదే రిపీట్ అవుతుంది. ప్రతి ముంపు కుటుంబాన్ని గుండెల్లో పెట్టుకొని.. వాళ్ల సమస్యలన్నీ పరిష్కరించిన వ్యక్తిని.. కొంతమంది తప్పుడు ప్రచారాలు చేస్తున్నారు. దేశంలోనే ఎక్కడాలేని విధంగా ఆర్‌అండ్‌ఆర్ కాలనీలు నిర్మించాం. ముంపు భాదితులకు పరిహారం ఇచ్చి ఆదుకున్నాం. రిజర్వాయర్ల నిర్మాణం కోసమే భూసేకరణ చేశాం. ఇవ్వాళ ఈ రిజర్వాయర్ల ద్వారా లక్షల ఎకరాలకు సాగు నీరు అందింది.

మీరు చేయాలనుకున్న సేవా కార్యక్రమాలు వివరిస్తారా..?

రూ.100కోట్లతో ట్రస్టు ఏర్పాటు చేసి నిరుపేదలకు ఉచితంగా నాణ్యమైన విద్య, స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలు, ఉద్యోగమేళాలతో యువత కలలు సాకారం చేస్తానని హామీ ఇస్తున్నాను. ఇక్కడ ఎక్కువమందికి ప్రైవేట్, ప్రభుత్వ రంగాల్లో ఉద్యోగావకాశాలు రావాలనేది నా తపన. హైదరాబాద్‌తోపాటు ఇతర నగరాల్లో కోచింగ్ సెంటర్లు ఏర్పాటు చేసి తర్ఫీదునిస్తాను. మెదక్ పార్లమెంట్ పరిధిలోని ప్రతి శాసనసభ నియోజకవర్గపరిధిలో ఒక ఫంక్షన్‌హాల్ నిర్మాణం చేస్తాను. పేదలకు రూపాయి ఖర్చుతో శుభకార్యాలు నిర్వహించుకునే అవకాశం కల్పిస్తాను. పెండ్లి భారం కావద్దని ఆడపడుచుల కుటుంబాలకు అండగా ఉండాలన్నదే నా ఆకాంక్ష. పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధి నిధులను వందకు వంద శాతం ప్రజల అవసరాలు తీర్చడానికి ఖర్చు చేస్తాను. ఎంపీగా గెలిచాక వచ్చే జీతం ఒక్క పైసా సొంతానికి వాడుకోకుండా సేవా కార్యక్రమాలకు వినియోగిస్తాను. ఉన్నత చదువులు చదివిన నేను ఉమ్మడి మెదక్ జిల్లాలో 11 ఏండ్ల పాటు ఒక అధికారిగా, కలెక్టర్‌గా సేవలందించాను. ప్రజాప్రతినిధులు, ప్రజల సహకారంతో సిద్దిపేట జిల్లాను దేశంలోనే అగ్రగామిగా నిలిపాను.

పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తారా..?

మెదక్ ప్రాంతంలో కలెక్టర్‌గా చేసిన అనుభవం ఉంది. ఎక్కడ ఏం అభివృద్ధి కావాలో నాకు ఒక విజన్ ఉంది. హైదరాబాద్‌కు దగ్గరగా ఉన్న ప్రాంతం కాబట్టి మరిన్ని పరిశ్రమలు అవసరం. రాజీవ్ రహదారి వెంబడి మరిన్ని విద్యా సంస్థలు తీసుకువస్తాను. మెదక్ పార్లమెంట్ పరిధిలో కేసీఆర్ ఆలోచనలు, హరీశ్‌రావు నాయకత్వంలో విద్య, పరిశ్రమలు, ఉపాధి ఇవన్నీ మరింతగా అభివృద్ధి చేయాలన్నదే నా ఆలోచన. ఎంపీ అయ్యాక ట్రస్టు ద్వారా నెల రోజుల్లో కార్యక్రమాలను ఆవిష్కరిస్తాను.

మీ ప్రత్యర్థుల గురించి మీరు ఏమంటారు..?

ప్రజలు నన్ను ఒక అధికారిగా ఆదరించారు. ప్రధాన పార్టీల్లో ఒక అభ్యర్థి కేవలం గెలుపు కోసమే నాలుగు నెలల్లో నాలుగు పార్టీలు మారారు. మూడు నెలల కిందట ఒక పార్టీ నుంచి ఓటు అడిగాడు. మళ్లీ ఇంకో పార్టీ నుంచి ఓటు అడుగుతున్నాడు. ఇంకో అభ్యర్థి మొన్నటి శాసనసభఎన్నికల్లో దుబ్బాకలో ఘోర పరాజయం అయ్యాడు. నిరుద్యోగ భృతి , బీడీ కార్మికులకు పెన్షన్ అన్నాడు..? రైతులకు ఎట్ల నాగలి ఇస్తాను అన్నాడు..? ఇవన్నీ ఏవీ ఇయ్యలేదు. టెక్స్‌టైల్ పార్క్, రైల్వే లైన్ ఇలా ఎన్నో మోసపూరిత వాగ్దానాలు చేసి చివరికి ప్రజలను మోసం చేసిన వ్యక్తి. ఈ మోసాలను ప్రజలు గుర్తించి దుబ్బాక ఎన్నికల్లో ధీటైన సమాధానం ఇచ్చారు. నేను ఏవి చేయగలుగుతానో వాటిని మాత్రమే ప్రజలకు హామీలు ఇస్తున్నాను. నేను చేయాలనుకున్నది ప్రజలకు చెప్పి ఓట్లు అడుగుతున్నాను. గెలుపు కోసం తప్పుడు వాగ్దానాలు చేయాల్సిన అవసరం లేదు. హుందాగా రాజకీయాలు చేయాలి. అసత్య ప్రచారాలు మానుకొని ఒక్కరిని ఒక్కరూ దుర్భాషలాడి ప్రజల్లో చులకన కావొద్దు. ఒక మంచి అభ్యర్థిగా ప్రజల్లో ఉండాలన్నదే నా కోరిక.

ప్రజానేతకు ఓరుగల్లు జన హారతి

- **అడగడుగునా కేసీఆర్‌కు జన నీరాజనం**
- **బస్సుయాత్రలో కలిసి నడిచిన జనం**
- **జై కేసీఆర్.. సీఎం కేసీఆర్.. నినాదాల హోరు**
- **వరంగల్‌లో కేసీఆర్ రోడ్‌షో గ్రాండ్ సక్సెస్**

హనుమకొండ చౌరస్తా వద్ద కేసీఆర్ రోడ్‌షోకి పెద్ద ఎత్తున తరలివచ్చిన జనం

వరంగల్, ఏప్రిల్ 28(నమస్తే తెలంగాణ ప్రతినిధి): లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా వరంగల్ నగరానికి వచ్చిన కేసీఆర్‌కు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. వరంగల్ నగరంలోకి ప్రవేశించినప్పటి నుంచి రోడ్‌షో ముగిసేవరకూ అడగడుగునా వేలాది మంది జనం కిలోమీటర్ల దూరం కేసీఆర్ వెంటే నడిచారు. రోడ్డు పొడవునా జనం రోడ్డకు ఇరువైపులా జై కేసీఆర్.. సీఎం కేసీఆర్ అంటూ నినాదాలతో స్వాగతం పలికారు. కేసీఆర్ బస్సు యాత్ర జనగామ, స్టేషన్ ఘన్‌పూర్ మీదుగా వరంగల్ మహానగరంలోకి చేరుకున్నది. రాంపూర్, మడికొండ, కాజీపేట, అదాలత్ సర్కిల్ మీదుగా బస్సులో కేసీఆర్ అంబేద్కర్ జంక్షన్ వరకు చేరుకున్నారు. అక్కడి నుంచి జనప్రవాహం కేసీఆర్‌కు ఎదురేగి వచ్చి ఘన స్వాగతం పలికింది. భారీగా వచ్చిన జనం మధ్య నుంచి సభ జరిగే హనుమకొండ చౌరస్తా వరకు చేరుకునేందుకు చాలా సమయం పట్టింది. అంబేద్కర్ జంక్షన్‌కు రాత్రి 7.37 గంటలకు వచ్చిన కేసీఆర్ అక్కడి నుంచి కిలోమీటరు దూరంలోని హనుమకొండ చౌరస్తాకు వచ్చే వరకు రాత్రి 8.25 అయ్యింది. కిక్కిరిసిన జనంతో బస్సు ఆలస్యంగా వెళ్లాల్సి వచ్చింది. వరంగల్ నగరంలో కేసీఆర్ రోడ్ షో మొత్తం భారీ జనంతో ఉత్సాహంగా సాగింది. కేసీఆర్ రోడ్ షోకు ప్రజలు దప్పు చప్పుళ్లతో స్వాగతం కలిపారు. కేసీఆర్‌ను చూస్తూనే కిలోమీటర్ల దూరం బస్సు వెంట నడుస్తూ వెళ్లారు.

హోరెత్తిన నినాదాలు

వరంగల్ లోక్‌సభ నియోజకవర్గంలోని వరంగల్ పశ్చిమ, వర్ధన్నపేట, స్టేషన్ ఘన్‌పూర్, పరకాల, వరంగల్ తూర్పు, పాలకుర్తి అసెంబ్లీ సెగ్మెంట్ల నుంచి భారీగా జనం కేసీఆర్ రోడ్ షోకు వచ్చారు. అదాలత్ జంక్షన్, నక్కలగుట్ట, అంబేద్కర్ జంక్షన్, పెట్రోలు పంపు జంక్షన్, మిషనరీ హాస్పిటల్, అశోక జంక్షన్ వద్ద అన్నివైపులా రోడ్లు జనంతో కిక్కిరిపోయాయి. కేసీఆర్ ప్రసంగం వినేందుకు, ఆయనను చూసేందుకు గంటలకొద్ది వేచి ఉండి, ఓపికగా ప్రసంగం విన్నారు. కేసీఆర్ ప్రసంగానికి మధ్యలో నినాదాలతో మద్దతు తెలిపారు. తెలంగాణ మలి ఉద్యమంలో వరంగల్‌తో తనకున్న సంబంధాన్ని కేసీఆర్ వివరిస్తున్నప్పుడు ప్రజలు జై తెలంగాణ అని గట్టిగా నినదించారు. సమైక్య రాష్ట్రంలో తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని కేసీఆర్ వివరించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వరంగల్ ఉమ్మడి జిల్లా అభివృద్ధి, సాగు, తాగునీరు, కరెంటు సరఫరా, వరంగల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మాణం, ములుగు, భూపాలపల్లి, జనగామ, మహబూబాబాద్, నర్సంపేటలో మెడికల్ కాలేజీల నిర్మాణం గురించి కేసీఆర్ చెప్పినప్పుడు జై కేసీఆర్, సీఎం కేసీఆర్ అన్న నినాదాలు హోరెత్తాయి. కాకతీయ టెక్స్‌టైల్ పార్క్ తెచ్చుకున్నం అన్నప్పుడు ప్రజలు చప్పట్లతో ప్రతిస్పందించారు. ఉమ్మడి రాష్ట్రంలో ఎస్సారెస్పీ కాలువ నుంచి నీళ్లు రాలేదని, కాళేశ్వరం కట్టిన తర్వాతే పరకాల, భూపాలపల్లి, వర్ధన్నపేట, నర్సంపేట, మహబూబాబాద్, డోర్నకల్, పాలకుర్తి నియోజకవర్గాల్లో సాగునీరు అందిందని, పుష్కలంగా పంటలు పండాయని కేసీఆర్ వివరించినప్పుడూ జనం చప్పట్లతో మద్దతు పలికారు.

కాంగ్రెస్ అన్యాయం, బీజేపీ ద్రోహంపై రగిలిన జనం

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అన్యాయం, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ ద్రోహంపై కేసీఆర్ వివరించినప్పుడు ప్రజలు రగిలిపోయారు. కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు ఎలా ఉన్నదని కేసీఆర్ అడిగినప్పుడు ఏమీ లేదని, జనం చేతులెత్తి చెప్పారు. కల్యాణలక్ష్మితో తులం బంగారం అందుతున్నదా? రైతుబంధు అందరికీ వచ్చిందా? రుణమాఫీ జరిగిందా? మహిళలకు రూ.2,500 ఇస్తున్నారా? రైతుబీమా వస్తున్నదా? అని కేసీఆర్ రోడ్‌షోకు వచ్చిన ప్రజలను అడిగారు. కేసీఆర్ అడిగిన ప్రతి ప్రశ్నకు ప్రజలు చేతులెత్తి లేదు అంటూ ముక్తకంఠంతో చెప్పారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వరంగల్ ఉమ్మడి జిల్లాకు అన్యాయం చేసిందని కేసీఆర్ అన్నప్పుడు జనం బీజేపీకి వ్యతిరేకంగా స్పందించారు.

రోడ్‌షోకి హాజరైన ప్రజలకు అభివాదం చేస్తున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

కడియం ద్రోహి.. అంటూ నినదించిన ప్రజలు

బీఆర్ఎస్ తరపున స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యేగా గెలిచి కాంగ్రెస్‌లో చేరిన కడియం శ్రీహరి పేరు లేకుండానే కేసీఆర్ ప్రసంగంలో ప్రస్తావించగానే.. రోడ్ షోకు వచ్చిన జనం 'కడియం ద్రోహి' అంటూ నినాదాలు చేశారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం కడియం శ్రీహరి ఎమ్మెల్యే పదవి పోతుందని, స్టేషన్ ఘన్‌పూర్‌కు ఉప ఎన్నిక వస్తుందని, రాజయ్య గెలుస్తాడని కేసీఆర్ మాట్లాడినప్పుడు జనం ఈళలు, చప్పట్లతో హనుమకొండ చౌరస్తా జంక్షన్ మార్మోగింది. లోక్‌సభ ఎన్నికల ప్రచారం కోసం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నిర్వహించిన రోడ్ షో భారీ జనంతో విజయవంతం అయ్యింది. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల్లో కేసీఆర్ రోడ్ షో ఉత్సాహాన్ని పెంచింది.

ఆ పోలీస్ అభ్యర్థులు అన్‌ఫిట్?

- **కండ్లతో చూసి పనికిరారని రాసిచ్చిన వైద్యులు**
- **ఏ చెకప్‌కు కొందరిని అనుమతించని బోర్డు**
- **సీఎం సొంత జిల్లాలోనే ఎక్కువ మందికి నష్టం**
- **కానిస్టేబుల్‌గా ఎంపికైనా తప్పని నిరాశ**

హైదరాబాద్, ఏప్రిల్ 28 (నమస్తే తెలంగాణ): ఉద్యోగాలకు ఎంపికయ్యామని ఆనందపడిన వారికి వైద్య పరీక్షలు, పెట్టీ కేసుల రూపంలో తీరని నిరాశ ఎదురైంది. వింతైన వైద్య పరీక్షలతో ఎందరో కొట్టుమిట్టాడుతున్నారు. కేసులు కొట్టివేసినా వారికి కనికరం చూపడం లేదు. ఇలా ఒకరు, ఇద్దరు కాదు.. వందలాది మంది అభ్యర్థులు నరకయాతన అనుభవిస్తున్నారు. వీరిలో ఎక్కువ మంది బాధితులు సీఎం రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న మహబూబ్‌నగర్ జిల్లా నుంచే ఉండటం గమనార్హం. తెలంగాణ స్టేట్ లెవల్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు నిర్వహించిన వివిధ పరీక్షల్లో తుది దశలో ఎంపికైన అభ్యర్థులకు గత ఫిబ్రవరిలో మెడికల్ టెస్టులను ఆదరాబాదరాగా చేయించినట్టు విశ్వసనీయంగా తెలిసింది. అప్పటికే సివిల్, ఏఆర్ వంటి విభాగాలకు ఎంపికైనట్టు బోర్డు నుంచి లేఖలు అందాయి. ఫిబ్రవరి మొదటివారం నుంచే మెడికల్ టెస్టులకు రావాలని అభ్యర్థులకు సందేశాలు పంపారు. చాలామందిని పరీక్షించకుండానే వైద్యులు ముఖం చూసి మెడికల్ టెస్టులు పాస్ చేయించారని విశ్వసనీయ సమాచారం. కొందరిని కాళ్లు, కండ్లు చూసి పరీక్షలు నిర్వహించకుండా వెరికోస్ వీన్స్, లో సైట్, మైల్డ్ హైడ్రోసిల్ పేరుతో 'అన్‌ఫిట్' అని రాసి ధ్రువీకరించారు. దీంతో కంగారుపడిన ఆయా అభ్యర్థులు వివిధ ప్రైవేట్ దవాఖానలకు వెళ్లి పరీక్షలు చేయించుకోగా ఎలాంటి లోపాలు లేవని తేలింది. ఆ రిపోర్టులతో తమకు రీచెకప్ చేయాలని ఎస్పీకి, టీఎస్ఎల్‌పీఆర్బీకి లెటర్లు పెట్టుకున్నా కనికరించే నాథుడే లేరు. అయితే, కొన్ని జిల్లాల్లో కొందరు అభ్యర్థులకు మూడోసారి కూడా రీచెకప్‌కు అవకాశం ఇచ్చినట్టు విశ్వసనీయంగా తెలిసింది.

కేసులపై విచారణలో అధికారుల అలసత్వం!

రాష్ట్రవ్యాప్తంగా సివిల్, ఏఆర్, టీఎస్ఎస్పీ విభాగాల్లో కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు తమ స్వీయ ధ్రువీకరణ పత్రంలో తమపై రకరకాల కారణాలతో నమోదైన సివిల్,క్రిమినల్,బైండోవర్,కరోనా, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘన కేసులు ఉన్నట్టు పోలీసులే ధ్రువీకరించారు. వీరిపై నమోదైన కేసుల్లో వారు విద్యార్థి దశలో చేసిన ఉద్యమ కేసులు, గ్రామీణ ప్రాంతాల్లో జరిగే కుటుంబ తగాదాలతో కక్షపూరితంగా, ఉద్దేశపూర్వకంగా నమోదైన కేసులే అత్యధికం. ఎంపికైన అభ్యర్థులపై నమోదైన చాలా కేసుల్లో ఇప్పటికే కొందరు అభ్యర్థులు కోర్టుల్లో నిర్దోషులుగా బయటపడ్డారు. స్పెషల్ బ్రాంచి అధికారుల తుది పరిశీలనలో కూడా అభ్యర్థులు ఆయా కేసులకు సంబంధించిన పూర్తి వివరాలతోపాటు,కేసుల్లో నిర్దోషిగా తేలిన కోర్టు జడ్జిమెంట్ కాపీలను అభ్యర్థులు స్పెషల్ బ్రాంచి అధికారులకు, బోర్డుకు అందించినా అలసత్వం వహిస్తున్నారు.

156 మందికి క్లియరెన్స్?

పోలీసు ఉద్యోగాలకు అర్హత సాధించి స్థానికత ధ్రువపత్రం, నేరచరిత్ర, సమాచారాన్ని గోప్యంగా ఉంచడం, వర్టికల్/హారిజాంటల్ రిజర్వేషన్ల అర్హత, మెడికల్ ఫిట్‌నెస్ తదితర అంశాల్లో సమస్యలను గుర్తించి సుమారు 700 మందిలో 326 మందిని తుది దశకు తీసుకొచ్చారు. అందులో న్యాయమైన వారిని ఎంపిక చేసే బాధ్యతను స్క్రీనింగ్ కమిటీకి అప్పగించారు. హోంశాఖ ముఖ్య కార్యదర్శి, న్యాయశాఖ కార్యదర్శి, సాధారణ పరిపాలన శాఖ కార్యదర్శి, డీజీపీ ప్రతినిధితోపాటు టీఎస్ఎల్‌పీఆర్బీ చైర్మన్ సభ్యులుగా ఉన్న స్క్రీనింగ్ కమిటీ నుంచి ఇప్పటికే 156 మందికి క్లియరెన్స్ ఇచ్చినట్టు తెలిసింది. మిగిలిన వారిలో సాధారమైన పెట్టీ కేసులు ఉన్నవారు, వైద్యుల ద్వారా అన్యాయానికి గురైన వారే ఎక్కువగా ఉన్నారని తెలిసింది. ఇప్పటికైనా సీఎం రేవంత్‌రెడ్డి చొరవ తీసుకొని తమపై కనికరం చూపాలని వారంతా వేడుకుంటున్నారు.

నా కాళ్లను చూసి 'వెరికోస్ వీన్స్' అని రాసి అనర్హత వేటు వేశారు. వైద్యులే అలా చేయడంతో భయపడి వెంటనే ఓ ప్రైవేటు దవాఖానలో పరీక్షలు చేయించుకున్నా. నాకు ఎలాంటి వెరికోస్ వీన్స్ లేవని తేలింది. ఆ రిపోర్టులు తీసుకొని ఏ చెకప్‌కు అవకాశం ఇవ్వాలని జిల్లా ఎస్పీకి, బోర్డుకు లేఖలు రాసినా స్పందన రాలేదు. 18 ఏండ్లుగా హోంగార్డుగా చేస్తున్నా.

- టీ రాములు, గాలిగూడ గ్రామం, బాలానగర్ మండలం, మహబూబ్‌నగర్ జిల్లా

సాగునీటిపై 'ఉత్తమా'టలు!

- **కాళేశ్వరంపై సాగునీటి మంత్రి అబద్ధాలు**
- **2018లోనే కాళేశ్వరం జలాలకు పూజలు**
- **ఐదేండ్లు ఏటా 30 టీఎంసీల నీళ్లు**
- **సూర్యాపేట జిల్లాలోనే అదనంగా 20 లక్షల ఎకరాల సాగు**
- **ఐదేండ్లలో సాగైంది 6.50 లక్షల ఎకరాలేనన్న మంత్రి**
- **సొంత జిల్లాలో పర్యటిస్తే కదా? వాస్తవం తెలిసేది!**

మేడిగడ్డ నుంచి సూర్యాపేట జిల్లా రావి చెరువుకు ఐదారు దశాబ్దాల తరువాత నీళ్లు రావడంతో పూజలు చేస్తున్న నాటి మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి(ఫైల్)

సూర్యాపేట, ఏప్రిల్ 28 (నమస్తే తెలంగాణ): ఆయన స్వయంగా ఇరిగేషన్ శాఖకు మంత్రి.. ఏ ప్రాజెక్టు కింద ఎంత సాగు? ఏ జిల్లాలో ఎంత పంట పండింది? అన్న సమాచారం తెలిసి ఉండాలి. కానీ, వాస్తవ పరిస్థితులు తెలుసుకోకుండా, కనీస అవగాహన లేకుండా అబద్ధాలతో ప్రజల్లో పలుచన అవుతున్నారు మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి. సూర్యాపేట జిల్లా పరిధిలో గోదావరి జలాల ఆయకట్టు అధికారిక లెక్కల ప్రకారం.. దాదాపు 2.60 లక్షల ఎకరాలు ఉండగా 2017 వరకు బావులు, బోర్ల కింద 55 వేల ఎకరాలకు మించి సాగుకు నోచుకోలేదు. 2018 నుంచి కాళేశ్వరం జలాలు రావటంతో ఏకంగా 2.58 లక్షల ఎకరాలకు చేరుకొన్నది. ఈ లెక్కన కాళేశ్వరం జలాలు వచ్చిన తర్వాత జిల్లాలో ప్రతి సీజన్‌కు పెరిగిన సాగు విస్తీర్ణం 2.03 లక్షల ఎకరాల చొప్పున ఏటా 4.06 లక్షలు. అంటే ఐదేండ్లలో సాగైన భూమి దాదాపు 20 లక్షల ఎకరాలు. కానీ, ఐదేండ్లలో మొత్తంగా కాళేశ్వరం జలాలతో సాగైంది కేవలం 6.50 లక్షల ఎకరాలే అని మంత్రి ఉత్తమ్ అనటం గమనార్హం.

కాలువల్లో నిరంతర జలాలు

కాళేశ్వరం జలాలను ఐదేండ్ల పాటు ఏటా రెండు సీజన్లలో ప్రతి సీజన్‌కు కాలువల్లో 1,200 నుంచి 1,700 క్యూసెక్కుల చొప్పున అవసరాన్ని బట్టి సీజన్‌కు 65 రోజుల నుంచి 100 రోజుల పాటు నిరంతరాయంగా నీటిని విడుదల చేశారు. బయ్యన్న వాగు నుంచి కాలువల ద్వారా నేరుగా పంట పొలాలకు సీజన్‌కు 12 క్యూసెక్కులతో పాటు జిల్లాలోని గోదావరి జలాల ఆయకట్టు పరిధిలోని దాదాపు 650 చెరువులు, కుంటలు నింపేందుకు మరో 2 టీఎంసీలు మొత్తం కలిపి ఒక్కో సీజన్‌కు 12 నుంచి 15 టీఎంసీల చొప్పున ఏడాదికి రెండు సీజన్లకు కలిపి దాదాపు 24 నుంచి 30 టీఎంసీల నీటిని విడుదల చేశారు.

కాళేశ్వరంపై తొలి నుంచీ అక్కసే

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణమైనప్పటి నుంచి కాంగ్రెస్ కడుపు కుతకుత ఉడుకుతున్నది. రైతుల కడుపు నిండుతున్నదనే సంతోషం కనిపించకపోగా, ఆ పార్టీ కడుపు మండుతున్నది. కాళేశ్వరం ప్రాజెక్టు ఫలితం వచ్చి ఊహించిన రీతిన వరిసాగు పెరిగి దేశానికే అన్నం పెట్టే స్థాయికి వచ్చినప్పటికీ ఆ పార్టీ బుద్ధి మారటం లేదు. తప్పుడు మాటలు వదలటం లేదు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంతో ఏటా 1.30 లక్షల ఎకరాల చొప్పున ఐదేండ్లలో 6.50 లక్షలకు మించిలేదని ఉత్తమ్ ఇటీవల ఓ స్క్రీన్ ఏర్పాటు చేసి ఓ కట్టుకథను అల్లి చెప్పారు. కానీ వాస్తవ పరిస్థితి గమనిస్తే సూర్యాపేట జిల్లాలోనే గత ఐదేండ్లలో కలిపి సాగైన మొత్తం విస్తీర్ణం 20 లక్షల ఎకరాలు. మరి మంత్రి ఉత్తమ్ చెప్పే లెక్క ప్రకారం కాళేశ్వరం ప్రాజెక్టు వచ్చిన తరువాత దాని పరిధిలో ఏటా 1.30 లక్షల చొప్పున ఐదేండ్లలో 6.50 లక్షల ఎకరాలే పండాయని చెప్పటం ఆయన మాటలు అబద్ధమని తేటతెల్లమవుతున్నది. వాస్తవానికి గ్రామాలకు వెళ్లి నీళ్లు ఎప్పటి నుంచి వస్తున్నాయని తెలుసుకుంటే కాంగ్రెస్‌కు నిజం తెలుస్తుంది.ఎన్ని లక్షల ఎకరాలు అదనంగా సాగులోకి వచ్చాయో తేలుతుంది. రూ.వేల కోట్లు వెచ్చించి కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మిస్తే చిన్న బరాజ్‌లను మరమ్మతులు చేయించలేని దద్దమ్మ కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా అబద్ధాలు మాని యుద్ధప్రాతిపదికన పనులు చేయించి తమను అదుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

నాలుగు ఎకరాలు సాగుచేస్తున్నా

మా ఊరు మొత్తంలో దాదాపు 1,200 ఎకరాల వ్యవసాయ భూమి ఉన్నది. కానీ నీటి సౌకర్యం లేక 300 ఎకరాల కంటే ఎక్కువ రైతులు వ్యవసాయం సాగు చేయలేకపోయేది. కేసీఆర్ సీఎం అయ్యాక అయిన తరువాత మా ఊరి పక్కనుంచే 71 డిస్ట్రిబ్యూటరీ కాలువ ద్వారా కాళేశ్వరం జలాలు వెళ్లటంతో భూగర్భ జలాలు పెరిగాయి. బోర్లు, బావుల్లో నీళ్లు పుష్కలంగా వచ్చాయి. దీనికి తోడు మా ఊళ్లోని చెరువులు, కుంటలను కాళేశ్వరం జలాలతో నింపటంతో సాగుకు ఢోకా లేకుండాపోయింది. నీటి సౌకర్యం ఎక్కువగా ఉండటంతో ప్రతి సీజన్‌లో దాదాపు 1,200 ఎకరాల్లో రైతులు సాగు చేస్తున్నారు. ఇది కాళేశ్వరం జలాలు వచ్చాకే సాధ్యమైంది. నాకు కూడా నాలుగున్నర ఎకరాల భూమి ఉన్నది, కాళేశ్వరం జలాపుణ్యమా అని ఆ భూమి సాగు చేస్తున్నా.

- తొట్టె లింగయ్య, పర్యాయపల్లి, అర్వపల్లి మండలం, సూర్యాపేట జిల్లా

ఐడీఈఏ అధ్యక్షుడిగా వీసీ సీతారామారావు

ప్రధాన కార్యదర్శిగా ఎల్ విజయకృష్ణారెడ్డి

సీతారామారావు

హైదరాబాద్ సిటీబ్యూరో, ఏప్రిల్ 28 (నమస్తే తెలంగాణ) : ఇండియన్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ అసోసియేషన్ (ఐడీఈఏ) కొత్త కార్యవర్గం ఏర్పాటైంది. గౌరవ అధ్యక్షుడిగా కాకతీయ యూనివర్సిటీ విశ్రాంత ఆచార్యులు కే మురళీ మనోహర్, అధ్యక్షుడిగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక యూనివర్సిటీ వీసీ కే సీతారామారావు, సెక్రటరీ జనరల్‌గా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం అభ్యాసక సేవా విభాగం డైరెక్టర్ డాక్టర్ ఎల్ విజయకృష్ణారెడ్డి, వివి